
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



ఆర్టీసీకి వడదెబ్బ!
నష్టాల బారి నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్న ఆర్టీసీ.. పెరుగుతున్న ఉష్ణోగ్రతల తో మళ్లీ ఆదాయం కోల్పోతోంది. 10లో



ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి
ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ పాల్వంచలోని కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 24°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతాయి. రాత్రి వరకూ వాతావరణం వేడిగానే ఉంటుంది.



న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకం : మాధవ్‌నాయక్

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం స్వార్థ రాజకీయాలతో సింగరేణి సంస్థ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తోందని బీఎంఎస్ జాతీయ నాయకులు పి.మాధవ్‌నాయక్ ఆరోపించారు. స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సింగరేణి నాలుగు బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనని సంస్థ.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ బిడ్‌లో పాల్గొంటుందా అని ప్రశ్నించారు. సింగరేణి సంస్థ ఆర్థిక సంక్షోభంలో పడిందని, కార్మికుల వేతనాల చెల్లింపులకు అప్పు కోసం బ్యాంకుల చుట్టూ ఫైనాన్స్ అధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో వాటా తీసుకునే ప్రయత్నం చేయడం సరైంది కాదని హితవు పలికారు. సమావేశంలో బీఎంఎస్ ఉపాధ్యక్షుడు జి.వి. కృష్ణారెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, నాయకులు ఊట్ల గణేష్, నరేంద్రబాబు, సంఘం చందర్, శ్రీనివాస్, సతీష్, యాకూబ్ పాల్గొన్నారు.

నలుదిశలా విస్తరణ!



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

'విశాఖ ఉక్కు'పై సింగరేణి ఆసక్తి

- ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తికే పరిమితం
- తెలంగాణ వచ్చాక విద్యుత్, సోలార్ రంగంలోకీ ఎంట్రీ
- సిమెంట్ రంగంపైనా సంస్థ ఆసక్తి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఆవిర్భావం తర్వాత సింగరేణి పనితీరులో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఓ వైపు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయినా, అప్పుల కుప్పగా మారుతోందనే విమర్శలు వస్తున్నా.. మరోవైపు బహుముఖంగా సంస్థ విస్తరిస్తోంది. ఈ పరంపరలో విశాఖ స్టీల్ ప్లాంట్ బిడ్డింగ్ అంశం తెరమీదకు వచ్చింది.

విద్యుత్ రంగంలో..
బొగ్గు ఉత్పత్తిలో సింగరేణికి 135 ఏళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు 1.20 లక్షల మందికి నేరుగా ఉపాధి కల్పించిన సంస్థలో ప్రస్తుతం 40 వేల మందికి పైగా పని చేస్తున్నారు. సంస్థ ఆరంభం నుంచి 2014 వరకు కేవలం బొగ్గు ఉత్పత్తి ప్రధానంగా సింగరేణి సంస్థ పని చేసేది. కానీ తెలంగాణ ఏర్పాటైన తర్వాత భవిష్యత్ ప్రణాళికల్లో మార్పులు వచ్చాయి. గత ఎనిమిదేళ్లలో ఈ ప్రణాళికలో చేర్చిన అనేక అంశాలు అమల్లోకి వచ్చాయి. బొగ్గు ఉత్పత్తితో పాటు దానికి అనుబంధంగా థర్మల్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయాలని సంస్థ నిర్ణయించింది. అందుకు తగ్గట్టే మంచిర్యాల జిల్లా జైపూర్ దగ్గర 1200 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని రికార్డ్ సమయంలో నిర్మించింది. ఆ తర్వాత సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోకి వచ్చింది. 500 మెగావాట్లు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది.

ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు ఉత్పత్తి..
సంస్థ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోనే సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి చేస్తూ వస్తోంది. ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి అవకాశాలు ఉన్నా అటువైపు సంస్థ దృష్టి సారించింది తక్కువే. కానీ తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి దృష్టి పెట్టింది. ఆలస్యం జరిగినా క్రమంగా ఒక్కో అనుమతి సాధిస్తూ ముందుకు కదులుతోంది. ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2023 మార్చి మొదటి వారం నుంచి ఇక్కడ బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉంది. కానీ అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ఇంకా ఉత్పత్తి ప్రారంభం కాలేదు. అనుమతి వస్తే ఇక్కడి నుంచి సాలీనా పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనుంది. (ప్రస్తుతం సత్తుపల్లి నుంచి ఏడాదికి 1.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది)

భవిష్యత్ ప్రణాళికలు ఇలా..
మూసేసిన గనుల నుంచి మిథేన్ గ్యాస్‌ను ఉత్పత్తి చేసే అంశంపై చాన్నాళ్లుగా సింగరేణి పరిశీలిస్తోంది. దీనిపై ఇప్పటికే అనేక సార్లు అధ్యయనాలు జరిగాయి. దీంతో పాటు భూమి నుంచి సహజసిద్ధంగా వచ్చే వేడి నీటి బుగ్గలను ఆధారంగా చేసుకుని జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో ప్రయోగాలు జరుగుతున్నాయి. వీటితో పాటు సిమెంట్ రంగంలోకి అడుగు పెట్టేందుకు సింగరేణి ఆసక్తి కనబరుస్తోంది. ఈ రంగంలోకి వెళ్లడానికి ముందుగా సున్నపురాయి మైనింగ్ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. అయితే ఇంత వరకు సింగరేణికి ఎటువంటి సున్నపురాయి లీజులు లభించలేదు.

ఉక్కు వైపు అడుగులు..

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఒకవేళ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తూ కేంద్రం బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తే సింగరేణి సంస్థ అందులో పాల్గొనేలా చేయాలనే వ్యూహంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సమితి సైతం ప్లాంట్ పరిశీలనకు రావాలని సింగరేణికి ఆహ్వానం పంపింది. ఈ మేరకు మంగళవారం సింగరేణి తరఫున డైరెక్టర్, జనరల్ మేనేజర్ (బిజినెస్), ఒక కన్సల్టెన్సీ నిపుణుడితో కూడిన బృందం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించింది. అన్నీ అనుకూలిస్తే ఉక్కు రంగంలోకి సింగరేణి అడుగు పెట్టే అవకాశం ఉంది.

అధిక ఫీజు వసూలు చేస్తే చర్య తప్పదు

మీ సేవ నిర్వాహకులకు కలెక్టర్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన కర్నాటి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మీ సేవ కేంద్రాల్లో వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని, అదనంగా తీసుకుంటే చర్య తప్పదని కలెక్టర్ అనుదీప్ హెచ్చరించారు. దీనిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఐడీఓసీ నుంచి గురువారం ఆయన రెవెన్యూ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 94 కోర్టు కేసులకు తక్షణమే కౌంటర్లు దాఖలు చేయాలని సూచించారు. గోదావరి వరదలతో ప్రజలు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కార్యాచరణ నివేదిక సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గతేడాది ఎదురైన అనుభవాల దృష్ట్యా ప్రజలను వరదల బారి నుంచి కాపాడేందుకు ప్రభావిత మండలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలని చెప్పారు. వేలిముద్రలు పడక ఇబ్బంది పడే వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. టేకులపల్లి, అశ్వాపురం మండలాల్లో ఆధార్‌సేవల కోసం చర్యలు చేపట్టాలని ఈడీఎంను ఆదేశించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా విచారణ నిర్వహించాలని చెప్పారు. రెండు పడక గదుల నిర్మాణాలకు ఇసుక కోసం ప్రతిపాదనలు అందజేయాలని పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమాధికారులకు సూచించారు. కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాల్లో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, ఆర్డీఓ స్వర్ణలత, ఏఓ గన్యా, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి, పీఆర్ ఈఈ సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, సర్వే ఏడీ కుసుమకుమారి, డీఎస్‌ఓ మల్లికార్జున్ బాబు, సివిల్ డీఎం త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లు..
రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సహకారశాఖ ఆధ్వర్యంలో 99, జీసీసీ 32, డీఆర్‌డీఏ 3 కలిపి మొత్తం 134 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన 25 మిల్లులకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని, వర్షాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పండిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసే లక్ష్యంతో కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,060, బీ గ్రేడ్‌కు రూ. 2,040 మద్దతు ధర ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాలు, మద్దతు ధర పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీసీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జీసీసీ డీఎం విజయకుమార్, మార్కెటింగ్ డీఎం అలీం, వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, తూనికలు, కొలతల అధికారి మనోహర్, రవాణా శాఖాధికారి జైపాల్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణ – తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై అవగాహన కలిగించేలా రూపొందించిన వాల్ పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ అనుదీప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాక్ క్లైంబింగ్‌కు ఎంపికైన విద్యార్థినికి అభినందన



విద్యార్థిని, ప్రిన్సిపాల్ తదితరులతో పీఓ గౌతమ్

భద్రాచలంఅర్బన్: చర్ల ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కల్తీ ప్రవీణ నేపాల్‌లో జరగనున్న రాక్ క్లైంబింగ్ క్యాంపునకు ఎంపిక కావడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన ప్రవీణతో పాటు ప్రిన్సిపాల్, పీడీ, ఆమె తల్లిదండ్రులను అభినందించి మాట్లాడారు. ఇల్లెందు మండలం ఎల్లారం గ్రామానికి చెందిన ప్రవీణ యాదాద్రి భువనగిరి క్యాంపస్‌లో శిక్షణ అనంతరం డార్జిలింగ్‌లో శిక్షణ తీసుకుంటూనే జాతీయ స్థాయి క్యాంపునకు ఎంపికైందని తెలిపారు. ఆమెతో పాటు తెలంగాణ నుంచి మరో ఇద్దరు ఎంపిక కాగా, మే నెలలో పర్వతారోహణకు వెళ్లనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎం.శకుంతల, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చండి

డీఎంహెచ్‌ఓ శిరీష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

భద్రాచలంఅర్బన్ : జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో టీబీ వ్యాధిని 40 శాతం తగ్గించి వెండి పతకం సాధించారని, అదే స్ఫూర్తితో ఈసారి 100 శాతం తగ్గించి బంగారు పతకం పొందాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మారుమూల ప్రాంతాల్లోనూ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లను సకాలంలో అందించి, రక్తహీనత నుంచి రక్షించాలని ఆదేశించారు. కోవిడ్ పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలని, ఎవరికైనా దగ్గు ,జలుబు, తీవ్రమైన జ్వరం ఉంటే వారికి మందులతో పాటు ఆరోగ్య సలహాలు అందించాలని అన్నారు. అనంతరం టీబీ నివారణలో జిల్లాకు రజిత పతకం రావడానికి కృషిచేసిన అధికారులు, సిబ్బందిని శిరీష సన్మానించారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, ఇమ్యూనైజేషన్ ఎస్‌ఓ ప్రశాంత్ కుమార్, విలేజ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రోగ్రాం అధికారులు, బాలాజీ, చైతన్య, మాణిక్ రెడ్డి, పర్షియానాయక్, జిల్లా సర్వైలెన్స్ అధికారి ఇమ్మానియేల్, వైద్యాధికారులు ఫైజుద్దీన్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

'గూడెం'లో వాట్సాప్ వార్ !

- సేవ పేరిట గడల రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
- శ్రీనివాసరావుపై త్వరలోనే కేసీఆర్‌కు ఫిర్యాదు
- సిద్ధమవుతున్న ఎమ్మెల్యే వనమా అనుచరులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకుడు గడల శ్రీనివాసరావును లక్ష్యంగా చేసుకుని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మద్దతుదారులు సోషల్ మీడియాలో చేసిన పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. ట్రస్ట్ ముసుగులో సేవా కార్యక్రమాల పేరు చెప్పి నియోజవకర్గంలో బీఆర్‌ఎస్ కేడర్‌లో చీలికకు గడల ప్రయత్నిస్తున్నారంటూ వనమా వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఇటీవల వాట్సాప్‌లో మెసేజ్‌లు పోస్ట్ చేయగా.. వనమా అనుచరులు దానికి తోడయ్యారు. దీంతో కొత్తగూడెంలో కొత్తగా వాట్సాప్ వార్ వెలుగులోకి వచ్చింది.

కుట్రలను ఎదుర్కొంటాం..
గడల శ్రీనివాసరావు లక్ష్యంగా వాట్సాప్‌లో వనమా మద్దతుదారులు పలు మెసేజ్‌లు వైరల్ చేశారు. జీఎస్సార్ ట్రస్ట్ ముసుగులో కొత్తగూడెంలో రాజకీయాలు చేస్తున్న డీహెచ్ కుట్రలను ఎదుర్కొనేందుకు వనమా సైన్యం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కరోనా సమయంలో హెల్త్ డైరెక్టర్‌గా ఉన్న గడల అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించారని, దీనిపై సీబీఐ విచారణ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నత స్థానంలో కొనసాగుతూ సేవా ముసుగులో రాజకీయ ఎజెండాతో కొత్తగూడెంలో పర్యటిస్తున్నారని ఆరోపించారు. ఆయన వైఖరితో నియోజకవర్గంలో పార్టీకి నష్టం జరుగుతోందని, ఈ విషయమై త్వరలోనే ప్రజాప్రతినిధులు, నాయకులంతా హైదరాబాద్‌కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నామని వివరించారు. గడలపై పోరాటం మొదలైందన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారని, గూడెం వనమా అడ్డా అని అంటున్నారు. ఆయనతో పోటీ పడే సత్తా ఎవరికీ లేదంటూ గడలపై ఫైర్ అవుతున్నారు. అంతగా రాజకీయాలపై ఆసక్తి ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రంగంలోకి దిగాలని సవాల్ చేస్తున్నారు. అయితే ఈ వాట్సాప్ వార్‌పై ఇటు వనమా కానీ అటు గడల కానీ నేరుగా ఎక్కడా స్పందించలేదు.

ట్రస్ట్ పేరుతో కార్యక్రమాలు..
ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన గడల శ్రీనివాసరావు ప్రస్తుతం హెల్త్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన తండ్రి గడల సూర్యనారాయణ పేరుతో జీఎస్సార్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. గత ఏడాది కాలంగా ఈ ట్రస్ట్ పేరుతో కొత్తగూడెం నియోజకవర్గంలో పండుగలు, ప్రత్యేక దినాలను పురస్కరించుకుని వరుసగా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంతేకాక పలుమార్లు తనకు రాజకీయాల్లోకి రావాలని ఉందని మనసులో మాట వెల్లడించారు. ప్రజాసేవలో ఉంటే రాజకీయాల్లో ఉన్నట్టే అంటూ కొత్త నిర్వచనం చెబుతూ వస్తున్నారు. మొత్తంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా చేసుకుని గడల అడుగులు వేస్తున్నారనే చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది.

నిధులెక్కడివి?
ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నత స్థానంలో ఉంటూ రాజకీయాలు చేయడం ఏంటని వనమా మద్దతుదారులతో పాటు ఇతర పార్టీల నేతలు గడల వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్నారు. హెల్త్ డైరెక్టర్ హోదాలో ఉంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు తరచుగా వినిపిస్తున్నాయి. జీఎస్సార్ ట్రస్ట్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు నిధులు ఎక్కడికి నుంచి వస్తున్నాయని ప్రశ్నిస్తున్నారు. అక్రమార్జనతోనే ట్రస్ట్ ఏర్పాటు చేశారని, అందులో పారదర్శకత లేదని ఆరోపిస్తున్నారు.



చీమలపాడులో కాలిపోయిన గుడిసె ఆనవాళ్లు

అంతా అనధికారికమే...

- విచ్చలవిడిగా బాణసంచా విక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో రెండు గోదాంలకే అనుమతి
- శుభకార్యాలు, రాజకీయ సభల్లో వినియోగం
- చీమలపాడు ఘటనతో బయటపడిన అగ్నిమాపక శాఖ, పోలీసుల నిర్లక్ష్యం

ఖమ్మంక్రైం: ఏ శుభకార్యమైనా.. రాజకీయ పార్టీల కార్యక్రమాలైనా బాణాసంచా వినియోగం తప్పనిసరిగా మారింది. సంబరాలకు ఇదో చిరునామాగా భావిస్తుండగా అమ్మకాలు, ఉపయోగానికి అనుమతి తీసుకోవాలనే విషయాన్ని అటు వ్యాపారులు, ఇటు ప్రజలు మరిచిపోయారు. ఇక బహిరంగ ప్రదేశాలు, రద్దీ కాంప్లెక్స్‌ల్లో బాణాసంచా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నా అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులు తనిఖీల ఊసే ఎత్తడం లేదు. చీమలపాడు దుర్ఘటన నేపథ్యాన బాణాసంచా అమ్మకాలపై చర్చ జరుగుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం
కారేపల్లి మండలం చీమలపాడులో బాణసంచా పేలుస్తుండగా నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు అంటుకోవడం, ఆపై సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. కారణం బాణసంచా పేల్చడమేనని వెల్లడైంది. కేవలం దీపావళి సమయంలోనే వివిధ శాఖల అనుమతితో బాణసంచా అమ్మాల్సి ఉండగా.. మిగతా సమయాల్లో అమ్మకాలు ఎలా జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రెండు షాపులకే అనుమతి..
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేవలం రెండు బాణాసంచా దుకాణాలకు మాత్రమే విక్రయానికి అగ్నిమాపక శాఖ అనుమతి ఇచ్చింది. మధిర సరిహద్దులో ఈ దుకాణాలు ఉండగా మరెక్కడా బాణాసంచా విక్రయానికి అనుమతి లేదు. ఎవరికి కావాలన్నా మధిర ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయాల్సిందే. కానీ అక్కడే షాపులకు అనుమతి ఉందనే విషయం చాలా మందికి తెలియకపోగా.. విచ్చలవిడిగా అమ్మకాలు, వినియోగం ఎలా జరుగుతుందన్నది తెలియరావడం లేదు.

అక్రమ నిల్వల నుంచే..
దీపావళి సమయంలో బాణాసంచా విక్రయించాక కొందరు వ్యాపారుల వద్ద భారీగా సరుకు మిగులుతుంది. వీటిని గోడౌన్లు, ఇళ్లు, షాపుల్లో నిల్వ చేసి అవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇలా అనుమతి లేకుండా నిల్వ చేయడం, అమ్మకాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఇల్లెందులో కొనుగోలు?
జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఈ సమయాన బాణాసంచా వినియోగించడం అంటే ప్రమాదాలను కొనితెచ్చుకోవడమే. చీమలపాడు ఘటనలో పేల్చిన బాణాసంచా ఇల్లెందులోని అంబబజార్‌లో కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా అక్రమంగా బాణాసంచా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

రెండేళ్లుగా కేసులే లేవు..
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాణాసంచా అక్రమంగా నిల్వ చేసి అమ్ముతున్నట్టు తెలిసినా అగ్ని మాపక, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు. కేసులు కూడా నమోదు కాలేదని తెలుస్తోంది.

అక్రమ నిల్వలపై దృష్టి సారిస్తాం..
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మధిరలో మాత్రమే రెండు బాణాసంచా దుకాణాలకు అనుమతి ఉంది. కారేపల్లితోపాటు, చుట్టు పక్కల మండలాల్లో అగ్నిప్రమాదం జరిగితే ఇల్లెందు నుంచి ఫైరింజన్లు వెళ్తాయి. మా సిబ్బంది కూడా చీమలపాడు వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాణాసంచా అక్రమ నిల్వలపై దృష్టి సారిస్తాం.
– జయప్రకాష్, ఉమ్మడి జిల్లా అగ్నిమాపక అధికారి

చీకట్లో వెళ్లి.. వైద్యం చేసి..



రాత్రి వేళ వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాందాస్‌నాయక్

మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల వలస గొత్తికోయల గ్రామం ఉడుములబండలో గురువారం రాత్రి వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన వలస గొత్తికోయలు పొద్దంతా వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఇది గమనించిన పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో చీకటి పడిన తర్వాత ఆ గ్రామానికి చేరుకుని 43 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. రాత్రి వేళ కూడా గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించడం పట్ల గొత్తికోయలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు. –అశ్వారావుపేటరూరల్

క్లుప్తంగా

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. చింత కాని మండలం జగన్నాథపురంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు హాజరుకానున్న ఆయన, ఖమ్మంలో జరిగే పలు శుభకార్యాల్లో పాల్గొం టారు. ఆ తర్వాత కారేపల్లి మండలం చీమల పాడు ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించాక, కొత్తగూడెంలో జరిగే ఇఫ్తార్ విందులో పొంగులేటి పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ చలాన్లపై ప్రత్యేక డ్రైవ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పాత మార్కెట్ సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ వీఎస్ రావు ఆధ్వర్యంలో వాహనాల ప్రత్యేక డ్రైవ్ చేప ట్టారు. పెండింగ్ చలాన్లను పరిశీలించి రుసుం వసూలు చేశారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలను ఆపి నంబర్ ప్లేట్లు సక్రమంగా ఏర్పాటు చేయించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొ ద్దని, సరైన ధ్రువపత్రాలు లేని బైక్‌లను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

డిజిటల్ తరగతులను ఉపయోగించుకోవాలి

పాల్వంచ డీఎస్పీ వెంకటేష్



ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించిన డీఎస్పీ వెంకటేష్

పాల్వంచరూరల్: విద్యార్థులు డిజిటల్ తరగ తులను సద్వినియోగం చేసుకోవాలని పాల్వం చ డీఎస్పీ ఎన్.వెంకటేష్ సూచించారు. మం డల పరిధిలోని పునుకుల గ్రామంలో ప్రభుత్వ స్కూల్లో నవభారత్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతుల సామగ్రిని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నవభారత్ యాజమాన్యం మారుమూల గిరిజన ప్రాం తాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం జీఎం ఎంజీఎం ప్రసాద్, సీఎస్ఆర్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ శ్యామ్‌సుందర్, సిబ్బంది, స్కూల్ హెచ్ఎం. టి.ఉషారాణి, ఉపసర్పంచ్ నాగార్జున, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

భద్రాచలంఅర్బన్: ఇసుక అక్రమంగా తర లిస్తున్న ఐదు లారీలను మైనింగ్ శాఖ అధికారు లు గురువారం పట్టుకుని పోలీసులకు అప్పగిం చారు. భద్రాచలం పట్టణ సరిహద్దున ఆంధ్ర ప్రాంతమైన గుండాల వద్ద ఉన్న ర్యాంప్ నుంచి అక్రమంగా ఐదు లారీల్లో ఇసుకను భద్రాచ లానికి తరలిస్తుండగా మైనింగ్ శాఖ అధికారు లు దాడి చేసి పట్టుకున్నారు. ఏపీ రాష్ట్రానికి చెం దిన వే బిల్లులు ఉండటంతో వాహనాలను పోలీసులకు అప్పగించారు. కాగా లారీ యజమానులపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. యజమానులు వాహనాలకు సం బంధించిన సరైన పత్రాలను అందజేయాలని టౌన్ సీఐ నాగరాజు రెడ్డి పేర్కొన్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్



రెవెన్యూ అధికారులు పట్టుకున్న మట్టి ట్రాక్టర్లు

దమ్మపేట: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెం డు ట్రాక్టర్లను దమ్మపేట తహసీల్దార్ స్వామి సీజ్ చేశారు. మండల కేంద్రంలోని రహదారిపై అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెం డు ట్రాక్టర్లను తహసీల్దార్ పట్టుకుని, తహ శీల్‌కు తరలించారు. నిబంధనలు అతిక్రమిం చి, అక్రమంగా మట్టి మైనింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, సీజ్ చేసిన ట్రాక్టర్లకు నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఆసు పాక గ్రామానికి చెందిన భూక్యా కనకారావుతో అనంతారం గ్రామానికి చెందిన మమతకు సుమారు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా కనకారావు కొంతకాలంగా అతిగా మద్యం తాగుతున్నాడు. చెడు వ్యసనాలు మాను కోవాలని భార్య వారించగా ఆమెపై దాడి చేసి, దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

మున్సిపాలిటీలో కుర్చీల కొట్లాట

- చైర్మన్, ఫ్లోర్ లీడర్ మధ్య ముదిరిన వైరం
- ఇల్లెందు ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారే అవకాశం..



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: ఇటీవల అవిశ్వాస తీర్మానం నోటీస్ అంద జేసిన నేపథ్యంలో చోటుచేసుకున్న అసంతృప్తి జ్వాల లు ఇంకా ఆరనేలేదు. కౌన్సిలర్లు కౌన్సిల్ హాల్‌లో ఇప్పటివరకు అడుగు కూడా పెట్టలేదు. తాజాగా రాజుకున్న వివాదం పాలకవర్గంలోని విబేధాలను మరోసారి బహిర్గతం చేసింది. మున్సిపల్ కార్యాల యంలో అసెంబ్లీ హాల్ తరహాలో సమావేశ మం దిరం ఏర్పాటు చేసుకున్నారు. కుర్చీలు, టేబుళ్ల మీద పాలకవర్గ సభ్యుల నేమ్ ప్లేట్‌లు సహా పలు సౌకర్యా లు కల్పించుకున్నారు. ఇప్పుడా కుర్చీల్లో ఇతరులు కూర్చోవడంతో వివాదం నెలకొంది. గత మంగళ వారం రాత్రి మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంక టేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వర రావుల మధ్య జరిగిన బాహాబాహీ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతేడాది కాలంగా మున్సిపాలిటల్లో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. పురపాలిక రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందుతుంటే.. పాలకవర్గ సభ్యులు మాత్రం ముష్టియుద్ధాలకు దిగుతున్నారు. మున్సిపల్ సమస్యలు చర్చించేందుకు రాత్రి 10 గం టల ప్రాంతంలో చైర్మన్ వెంకటేశ్వరరావు ఇంటికి ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావుతో ఎమ్మెల్యే భర్త, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు హరిసింగ్ నాయక్ వెళ్లి మరో వివాదంలో ఇరుక్కున్నారు. కౌన్సిలర్ల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలలో సిబ్బందిని కూర్చో బెట్టి సమావేశం పెట్టడాన్ని ఫ్లోర్ లీడర్ నాగేశ్వర రావుతో పాటు సభ్యులు తీవ్రంగా తప్పుపడుతు న్నారు. మున్సిపల్ అభివృద్ధికి 24 గంటలు శ్రమించే సిబ్బంది కుర్చీల్లో కూర్చుంటే తప్పేంటని చైర్మన్ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ అవిశ్వాసం అం శం కోర్టులో, మరో వైపు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. కోర్టు తీర్పు వచ్చినా, గవర్నర్ ఆమోదం తెలిపినా పరిష్కారం లభిస్తుందని ఇరువర్గాలు ఎదు రుచూస్తున్నాయి. ఈ తరుణంలో బడ్జెట్ సమావేశం నిర్వహించగా, మెజార్టీ అసమ్మతి కౌన్సిలర్లు గైర్హా జరయ్యారు. తాజాగా సమీక్షా సమావేశం సమా చారం ఎందుకు ఇవ్వలేదని, తమకు కేటాయించిన కుర్చీల్లో సిబ్బంది కూర్చోవటం తమను అవమానిం చినట్టేనని సభ్యులు ఆవేదన చెందుతున్నారు. వీటిపై చర్చించేందుకు ఫ్లోర్ లీడర్ హరిసింగ్ నాయక్ వద్దకు వెళ్లటం, అక్కడి నుంచి ఇద్దరూ కలిసి మున్సిపల్ చైర్మన్ ఇంటికి చేరడం, చర్చిస్తున్న క్రమం లో చైర్మన్‌కు, ఫ్లోర్ లీడర్‌కు మధ్య బాహాబాహీ జరిగింది. ఈ ఘర్షణ మరోమారు ఎమ్మెల్యే హరిప్రి యకు తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

ఇంటికి వెళ్తే దురుసుగా ప్రవర్తిస్తారా..

మున్సిపల్ సమస్యలు చర్చించేందుకు రమ్మంటే హరిసింగ్ నాయక్‌తో కలిసి చైర్మన్ ఇంటికి వెళ్లాను. ఇంటికి వెళ్లిన వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించ టం సరికాదు. ఇలా చేస్తే కలిసి పని చేసేది ఎలా. తన పట్ల దురుసుగా ప్రవర్తించినా ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్ నాయక్‌ల సూచన మేరకు రచ్చ చేయకుండా ఓపిక పట్టాం. 13 మంది కౌన్సిలర్లు తన పట్ల దురుసుగా వ్యవహరించిన తీరును నిరశించారు. మద్దతుగా నిలిచారు.

– కొక్కు నాగేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్

ఇది చర్చించేందుకు రావాల్సిన అవసరం లేదు..

మున్సిపాలిటీ హాల్‌లో ఉన్న కుర్చీల్లో ఇతరులు, సిబ్బంది కూర్చున్నంత మాత్రన పోయేది ఏమీ లే దు. వారిని కూడా మనం గౌరవించాలి. పట్టణ అభి వృద్ధికి పాటుపడే వారిని హాల్‌లో కూర్చోనిస్తే ఏమ వుతుంది. ఈ విషయం చర్చించేందుకు రావాల్సిన అవసరంలేదు. అయినా వచ్చినప్పుడు అసభ్యంగా మాట్లాడరాదు. మున్సిపాలిటీ అనేక విషయాల్లో అ గ్రస్థానంలో ఉంది. ఐక్యంగా పనిచేస్తే మరింత ముం దుకు వెళ్లవచ్చు.

–దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

పాల్వంచ: ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్ 82) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్లకు 50శాతం పీఆర్సీ ఇవ్వాలని కోరారు. ఈ నెల 25న తలపెట్టిన సమ్మె లో ఆర్టిజన్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఒకే సం స్థలో ఒకే సర్వీస్ రూల్స్ ఉంటాయని, కానీ విద్యుత్ సంస్థల్లో బ్రిటీష్ స్టాండింగ్ ఆర్డర్స్‌ను రుద్దుతున్నా రని విమర్శించారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, సీఎం కేసీఆర్ తమను ఆర్టిజన్లుగా తీసుకు న్నారని, అదే రీతిలో తమ సమస్యలను పరిష్కరిం చడం కూడా బాధ్యతగా స్వీకరించాలని కోరారు. ఆందోళనకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృ ష్ణ, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చందర్ రావులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జెన్‌కో రాష్ట్ర కార్యదర్శి ఆవుల కృష్ణారెడ్డి, అధ్యక్షులు ఉండేటి జయరాజు, జలీల్, బాలకృష్ణ, బాల్ రెడ్డి, శ్రీకాంత్, రాము, పురుషోత్తం, సునీల్, హనుమంత రావు, మధు, మసూద్, కేసరి రవీందర్, లకావత్ శంకర్, సాంబ, అనిల్, నవీన్, శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, షషి, దస్తు, సమి, కోటేశ్వరరావు, శ్రీను, రాంబాయి, లక్ష్మి, ఆదిలక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న మద్దిశెట్టి సామ్యేల్

టేకులపల్లి: నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని భారతీయ సర్వ సమాజ్ మహాసంఘ్ (బీఎస్ఎస్ఎం) తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మద్దిశెట్టి సామ్యేల్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఫర్ పీపుల్ జాతీయ అధ్యక్షుడు ఉన్నం జ్ఞాన సుందరి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం లోని లచ్చతండాలో బీఎస్ఎస్ఎం, అణగారిన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సొంత స్థలం కలిగినవారు ఇల్లు నిర్మించుకునేలా ఆర్థికసాయం అందించాలని, పోడు భూములకు పట్టాలు, గిరిజన పూజారులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యద ర్శులు ఊకె భవాని, బాణోతు జ్యోతి, రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ వర్స వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఈసం రవి, జిల్లా కార్యదర్శి గుగులోత్ రమేష్ నాయక్, జిల్లా యువజన అధ్యక్షుడు గుగులోత్ నాగేశ్వర్‌నాయక్, మండల అధ్యక్షుడు సూరే సీతారాములు, నాయకు లు ఈసం నాగలక్ష్మి, రచ్చ సుజాత, వర్స మంగ, ఈసం నర్సమ్మ, గరిడేపల్లి రవి, భూక్య రవి తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికుడికి విద్యుదాఘాతం

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స



తీవ్ర గాయాలపాలైన మల్టీపర్పస్ వర్కర్ వెంకటేశ్

టేకులపల్లి: మండలంలోని చుక్కాలబోడు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గురువారం విద్యు దాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుక్కాలబో డు గ్రామానికి చెందిన భూక్య వెంకటేశ్ అదే గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తు న్నాడు. గురువారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు లోని రైతు వేదికలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లు, ఈజీఎస్ సిబ్బందికి ఎంపీడీఓ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) సమావేశం ఏర్పాటు చేశారు. రైతు వేదికలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు సర్పంచ్ సురేందర్ లైన్‌మెన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ కావాలని అడుగగా, లైన్‌మెన్ సబ్‌స్టేషన్ ఆప రేటర్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకున్నాడు. అనంతరం సర్పంచ్ సురేందర్ వెంకటేశ్‌ను విద్యుత్ స్తంభం ఎక్కించాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో కింద పడ్డాడు. తోటి కార్మికులు, కార్య దర్శులు సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అనం తరం హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా వర్కర్ వైద్య ఖర్చుల నిమిత్తం టేకులపల్లి మండల కార్యదర్శులు అందరూ కలిసి రూ.42వేల ఆర్థిక సాయం అందజే శారు. కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో వెంకటేశ్‌ను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పరామర్శించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని పంచాయతీ వర్కర్ల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బొమ్మనపల్లి విద్యుత్ ఏఈ బుజ్జికన్నయ్యను వివరణ కోరగా.. లైన్‌మెన్ దేవ్‌సింగ్ ముత్యాలంపాడు ఫీడర్‌లో ఎల్‌సీ కావాలని అడుగగా, ఆపరేటర్ అదే ప్రాంతానికి ఎల్ సీ ఇచ్చాడని, వాస్తవానికి రైతు వేదిక విద్యుత్ లైన్ సులానగర్ ఫీడర్ కిందకు వస్తుందని వివరించారు. కాగా బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈ ఘటనకు బాధ్యులైన మాళోతు సురేందర్, కార్తీక్, భూక్య గంగాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటం

టేకులపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్ యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య కిషోర్‌సింగ్ పేర్కొ న్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తొలుత సంఘం జెండాను ఆవిష్క రించారు. జిల్లా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా జిల్లాలో పదో తరగతి స్పాట్ వాల్యూ యేషన్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని అన్నారు. జిల్లా ఉపా ధ్యక్షురాలు వాసం వరలక్ష్మి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ తాయి, నరసింహారావు, నాయకులు మాన్‌సింగ్, వీరన్న, రాజేందర్, చందర్ రావు, నాగునాయక్, లక్ష్మి, హరికుమార్, బి.సుజాత, కృష్ణవేణి, హైమావతి, సుజాత, రమేష్, నరసింహారావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

చండ్రుగొండ : వివిధ పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధి కారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్, జిల్లా సమ్మిళిత విద్యాధికారి సైదులు పరీక్షల నిర్వహ ణను పరిశీలించారు. పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. పోకలగూడెం, చండ్రుగొండలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. మనఊరు మన బడి కార్యక్రమం పను లను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ సత్తెనప ల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

ఖమ్మంమయూరిసెంటర్: చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారి కుటుం బాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో బీఎస్పీ నాయకులు గురువా రం ఖమ్మంలో మంత్రి పువ్వాడ క్యాం పు కార్యాలయ ముట్టడికి యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అడ్డు కుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేందర్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులను శిక్షించడమే కాక బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తొలుత జెడ్పీసెంటర్‌లో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీఎస్పీ నాయకులు పీ.సీ.వీరస్వామి, ఎం.పుల్ల య్య, బుర్ర ఉపేందర్, మిర్యాల నాగరాజు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, ఉప్పల మంజుల, శ్రీకాంత్, పి.విజయ్, అల్లిక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

తండ్రి కళ్లెదుటే నీటిలో మునిగి తనయుడి మృతి



ఏసుబాబు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన కన్న తండ్రి కళ్లెదుటే గురువారం చోటు చేసుకోగా, తీరని విషాదాన్ని మిగిల్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఊసిర్లగూడేనికి చెందిన కొర్సా ఏసుబాబు అలియాస్ చందు(17) తండ్రి రాముడు మరికొం దరు గ్రామస్తులు కలిసి కొత్త మామిళ్లవారిగూడెం సమీపంలో ఉన్న ఊర చెరువులో చేపల వేటకు వెళ్లారు. గ్రామస్తులు చేపల వేట సాగిస్తుండగా, ఏసు బాబు తన నలుగురు స్నేహితులతో కలిసి ఈతకు దిగాడు. ఈత కొట్టే క్రమంలో ఏసుబాబు ప్రమాదవ శాత్తు లోతులో ఉన్న ప్రదేశానికి వెళ్లి నీటిలో మును గుతూ కేకలు వేశాడు. చెరువు గట్టుపై ఉన్న తండ్రి రాముడు గమనించి రక్షించేందుకు వెళ్లగా అప్పటికే నీటిలో మునిగిపో యాడు. గ్రామస్తులు కూడా చెరు వులోకి దూకి గాలించి ఏసు బాబును బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. ఒక్కాగానొక్క కుమారుడు కళ్లెదుటే నీటిలో మునిగి మృతి చెందడంతో తండ్రి తోపాటు తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చందు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై బి.రాజేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించి పోస్టుమార్టం జరిపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిన్నబోయిన చీమలపాడు

- దుర్ఘటన నుంచి తేరుకోలేకపోతున్న గ్రామస్తులు
- ఎవరిని కదలించినా కన్నీళ్లే..
- ముగ్గురు మృతుల అంత్యక్రియలు పూర్తి



కారేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కారేపల్లి: బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం హడావుడి.. అంతలోనే గుడిసెకు నిప్పు, ఆపై భారీ పేలుడు శబ్దం.. ఏం జరిగిందో అర్థమయ్యేలోగా తెగిపడిన కాళ్లు, రక్తపు మరకలు, మాంసపు ముద్దలు.. ఇదీ కారేప ల్లి మండలం చీమలపాడులో బుధవారం నాటి పరిస్థితి ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈమేరకు గ్రామంలో గురువారం పరిశీలించి ఎవరిని కదిలించినా ఆ భయానక ఘటనే కళ్ల ముందు కదు లుతోందని చెప్పారు. ఊహించని విధంగా చోటు చేసుకున్న ఘటన నుంచి ఇంకా తేరు కోలేకపోతున్న వారు అప్పటి వరకు తమతో గడిపిన వారు ఇక లేరనే విషయాన్ని జీర్ణిం చుకోలేక కన్నీటి పర్యంతమవుతున్నారు.

కాలిపోయిన గుడిసె రాజన్నోల రాములుది

చీమలపాడులో బీఆర్ఎస్ కార్యకర్తలు బాణసంచా కాల్చగా నిప్పురవ్వలు పడి కాలిపోయిన గుడిసె రాజన్నోల రాములు(జ క్కుల రాములు)ది. వీరు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు నెలల తరబడి వెళ్లి ఆయుర్వేద మూలికలు అమ్ముకుంటూ జ్యోతిష్యం చెబుతూ పొట్టపోసుకుంటారు. టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఘటన విష యంతెలుసుకున్న రాములు గురువారం వచ్చి చూసి వెళ్లినట్లు సమాచారం. కాగా, గుడిసె కాలిపోయిన ప్రాంతాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకుని విచారణ చేపట్టారు. సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా రిబ్బన్లు అమర్చారు. దీంతో నిన్న సభావేదిక, తోర ణాలు, జనం రాకపోకలతో కళకళలాడిన ఆ ప్రాంతం ఇప్పుడు బోసిపోయి కనిపించింది.

కారేపల్లి బంద్ ప్రశాంతం

చీమలపాడు ఘటనకు బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ సీపీ ఎం, సీపీఐ, న్యూడెమోక్రసీతో పాటు కాంగ్రె స్, బీజేపీ ఆధ్వర్యాన గురువారం కారేపల్లి బంద్‌కు పిలుపునిచ్చారు. ఈమేరకు దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటిం చగా, నాయకులు బస్టాండ్ సెంటర్‌లో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల అజాగ్ర త్తతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై ప్రకాశ్, బొల్ల రామస్వామి, కె నాగేశ్వరరావు, కె నరేందర్, పగడాల మంజుల, తలారి చం ద్రప్రకాశ్, తురక నారాయణ, సుజాత తదిత రులు పాల్గొన్నారు.



కారేపల్లిలో బంద్‌తో మూసివేసిన దుకాణాలు

ఇంటి పెద్దను కోల్పోయాం...

గేటురేలకాయలపల్లికి చెందిన బానోతు లక్ష్మా-సరోజ దంపతులకు నాలుగురు కుమార్తెలు కాగా సరస్వతి, బిందుకు వివాహమైంది. మిగతా వారిలో రాజేశ్వరి వారణాసి ఐఐటీలో, దుర్గ హైదరాబాద్‌లో ఐఐటీ చదువుతున్నారు. వీరు గురువారం గ్రామానికి చేరుకుని తండ్రి మృతదేహం పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. పెద్ద దిక్కును కోల్పోయిన తాము ఎలా బత కాలంటూ వారు రోదిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది. కాగా, లక్ష్మాకు నలుగురు కుమార్తెలు కావడంతో పెద్ద కుమార్తె సరస్వతి తలకొరివి పెట్టింది.

ఘటనపై కేసు నమోదు

చీమలపాడు ఘటనలో తీవ్రంగా గాయ పడి, మృతి చెందిన అజ్మీరా మంగూ కుటుం బీకులు చేసిన ఫిర్యాదుతో కారేపల్లి పోలీసు లు గురువారం కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మంగూ, పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చడంతో నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు లేవగా.. సిలిండర్ పేలుడుతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా మృతుడి సోదరుడు అజ్మీరా వాసు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మార్గదర్శి కేసులో పారదర్శకంగా దర్యాప్తు

- చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం
- సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలికి తీయడమే తమ లక్ష్యమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం మౌన ప్రేక్షకులుగా ఉండరాదని 2011లో ఓ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తిస్తూ చట్టబద్ధ సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం, ఉద్యోగులు నిబంధనల రికార్డులు, డాక్యుమెంట్లు సీఐడీకి అందచేసి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు. గతంలో శ్రీరామ్ చిట్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా తమకు ప్రామాణికమన్నారు.

విచారణకు సహకరించాల్సిందే

మార్గదర్శి ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

- తనిఖీలు ఆపేలా ఉత్తర్వులివ్వలేం
- మీడియాకు వివరాల వెల్లడిపైనా జోక్యం చేసుకోలేం
- విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారుల విచారణకు మార్గదర్శి ఉద్యోగులు సహకరించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేంద్ర కార్యాలయ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయస్థానం.. తనిఖీలు, విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. మీడియాకు అధికారులు వివరాలు వెల్లడించకుండా కూడా జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మార్గదర్శి కేంద్ర కార్యాలయ ఉద్యోగులపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తనిఖీలు ముగిశాక పిటిషనా?

మార్గదర్శి ఉద్యోగులు గురువారం లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోకుండా నిరోధించాలని, తనిఖీలు నిలిపివేసేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరపు న్యాయవాది విన్నవించారు. అయితే బుధవారం ప్రారంభమైన తనిఖీలు గురువారం ఉదయం 9 గంటలకే ముగిశాయని, అలాంటప్పుడు తనిఖీలు ఆపాలని పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి పేర్కొన్నారు. 'సీఐడీ అధికారుల తనిఖీలు ముగిశాయి. ఏ ఉద్యోగిపైనా చర్యలు తీసుకోలేదు. ఎవరినీ బలవంతపెట్టలేదు.. భయపెట్టలేదు. అరెస్టులు చేయలేదు. చట్టప్రకారమే తనిఖీలు జరిగాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదు. పలువురు బ్రాంచ్ మేనేజర్లకు, బ్రాంచ్ ఉద్యోగులకు నోటీసులిచ్చాం. కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు' అని హైకోర్టుకు నివేదించారు.

విచారణలో జోక్యం వద్దన్న 'సుప్రీం'..

'ఏ–1 రామోజీరావు, ఏ–2 శైలజ సహా పలువురు మేనేజర్లు ముందస్తు బెయిల్ పొందారు. వారిని కనీసం కస్టడీకి తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. చట్టబద్ధమైన సంస్థలు కేసును విచారించే సమయంలో పూర్తి వివరాలను పరిశీలించకుండా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీం కోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చింది. నిహారికా ఇన్‌ఫ్రా. వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుపై విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 438 సీఆర్‌పీసీ కింద ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వకూడదని పేర్కొంది. పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి 'వెకేట్' పిటిషన్ దాఖలు చేసుకోవాలని ప్రతివాదులను ఆదేశించడం సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి రిలీఫ్ ఉత్తర్వులు ఇవ్వవద్దు' అని గోవింద్‌రెడ్డి అభ్యర్థించారు.

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే



కేంద్ర సహాయ మంత్రితో సమావేశమైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. గురువారం విశాఖ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ కంటే ముందు ఆర్‌ఐఎన్‌ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూర్తి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియపై దృష్టి సారించామని తెలిపారు. గనుల సమస్యను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటిపై ఆర్‌ఐఎన్‌ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆయన నోవోటెల్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం చేసిన ప్రకటనపై మరింత క్లారిటీ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్లాంట్‌ను మరింత బలోపేతం చేస్తామని మాత్రమే మీడియాకు చెప్పానన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చేలా సహకరిస్తామన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

సింగరేణిలో ఆంధ్ర వాటా తేల్చండి

బీఆర్‌ఎస్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయంగా వినియోగించుకుంటోందని ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ అన్నారు. సింగరేణి గనుల్లో ఆంధ్ర రాష్ట్రానికి వాటా ఉందని, ముందు ఆ వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై బీఆర్‌ఎస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే పోలవరానికి సహకరించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు.

రుషికొండలో ఉల్లంఘనల్లేవ్

హైకోర్టుకు నివేదించిన కేంద్ర సంయుక్త కమిటీ

సాక్షి, అమరావతి: రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా విశాఖలోని రుషికొండపై చేపడుతున్న నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవని హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కమిటీ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం నివేదికను కమిటీ బుధవారం హైకోర్టుకు సమర్పించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతించిన మేరకు 9.88 ఎకరాల ప్రాంతంలోనే ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ రుషికొండ రిసార్ట్ ప్రాజెక్టు భవనాలను చేపట్టిందని తెలిపింది. వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఎలాంటి ఉల్లంఘనలు లేవని కమిటీ తేల్చింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ హై కోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం దాదాపుగా సరిపోతున్నట్లు పేర్కొంది. మట్టిడంప్ ప్రాంతమే అథారిటీ పే ర్కొన్న దానికన్నా కొంచెం ఎక్కువగా ఉందని, అయితే నిర్మాణం పూర్తయిన తరువాత డంప్ చేసిన మట్టిని తొలగిస్తారని కమిటీ తెలిపింది.

ఇంకా ఎన్నాళ్లీ విచారణ?

- సీబీఐ న్యాయవాదిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- వివేకా హత్య కేసులో తదుపరి విచారణ 17కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు అయ్యిందని.. ఇంకా ఎన్నాళ్లు విచారిస్తారని సీబీఐని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. హత్య కేసును కూడా ఇన్నాళ్లు సాగదీస్తే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చెప్పినట్లు ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున నాగేందర్ వాదనలు వినిపించారు.

కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ..

'గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలం తప్ప కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు. వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఇక్కడే ఉండి.. నా ఫోన్‌ను మరో చోటకు తీసుకుపోతే నేను అక్కడ ఉన్నట్లు కాదు. కాబట్టి గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణనలోకి తీసుకోలేం. ఇలాంటి పరిస్థితిలో వారిని వేధింపులకు గురి చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటికే సీబీఐ వారిని పలుమార్లు విచారణకు పిలిచింది. వారు కూడా పూర్తిగా విచారణకు సహకరించారు. ఎర్ర గంగిరెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ ఇప్పటివరకు రికార్డు చేయలేదు. సీబీఐ.. దర్యాప్తును ఇంకా సాగదీస్తోంది. కారణం ఏంటో తెలియడం లేదు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలైనా దర్యాప్తు ఆపాలని ఏ ధర్మాసనం చెప్పలేదు. దర్యాప్తు అధికారి కేసును తప్పుదారి పట్టిస్తుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక కిరాయి హంతకుడిని అరెస్టు చేయకుండా బెయిల్‌కు సహకరించిన విచారణను ఏమనాలి? కేవలం కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ సాగుతోంది తప్ప.. సాక్ష్యాలు సేకరించే పని చేయడం లేదు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వైఎస్ భాస్కర్ రెడ్డి, ఇతరులు (నిందితులుగా లేని వారు) పరారీలో ఉన్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదు.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు అని సీబీఐ తరఫు న్యాయవాది నాగేందర్ తెలిపారు. కోర్టులో పిటిషన్ల కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందన్నారు. దర్యాప్తు అధికారికి.. కోర్టు పిటిషన్లతో ఏం సంబంధం.. ఆయన విచారణ కొనసాగించవచ్చు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సుప్రీంకోర్టు.. దర్యాప్తు పూర్తి చేయడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. ఇది హత్య మాత్రమే కాదని.. హత్య ద్వారా లబ్ధి పొందేందుకు కుట్ర జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

విహరించే వనంపై మోహరించిన అవినీతి

- కేబీఆర్ పార్క్‌ను కనుమరుగు చేసే కుట్ర
- మంత్రి డెవలపర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతి
- కేటీఆర్ మిత్రుల కోసం నిబంధనలు గాలికి
- రాజయ్యను బర్తరఫ్ చేసినట్లు కేటీఆర్‌నూ చేయాలి
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబం ధనదాహంతో దశాబ్దాల చరిత్ర కలిగిన కేబీఆర్ పార్కును కనుమరుగు చేసే కుట్రకు తెరతీసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీ హిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులివ్వడమంటే హైదరాబాద్ నగరంలో విధ్వంసం సృష్టించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. 16 మంది సీఎంలు కఠిన నిబంధనలు పెట్టి కాపాడిన చరిత్రాత్మక వారసత్వ సంపద కలిగిన పార్కును ఈ ప్రభుత్వ పెద్దలు ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కేటీఆర్ స్నేహితుల కోసం చేస్తున్న ఈ ఆగడాలను కేసీఆర్ వెంటనే అడ్డుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు. మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేసినట్టు కేటీఆర్‌ను కూడా వెంటనే బర్తరఫ్ చేయాలని, అప్పుడే కేసీఆర్‌కు పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

''2012లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్‌ఎంసీ అక్కడ మూడు అంతస్తుల నిర్మాణానికే అనుమతి ఇచ్చింది. కానీ 2016లోని టీఆర్‌ఎస్ సర్కారు మంత్రి డెవలపర్స్‌కి జీ ప్లస్ 7 ఫ్లోర్లకు అనుమతిచ్చేసింది. ఇక మంత్రి డెవలపర్స్‌లో ఆర్ ఎస్‌ఆర్ డెవలపర్స్ భాగస్వాములు అయ్యాక 12 అంతస్తులకు దరఖాస్తు చేసుకుంటే దానికి కూడా అనుమతిచ్చేశారు. ఇప్పుడు ఏకంగా 15 అంతస్తులకు కూడా అనుమతిచ్చేశారు ''అని రేవంత్ వివరించారు.

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతి ఎక్కడైనా ఉందా?

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతిచ్చారని.. ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీరు తవ్విన గోతుల్లోనే మిమ్మల్ని పాతిపెడతామంటూ రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్ వాళ్లకు ఆంధ్రానే దిక్కని.. ఆపై బంగాళాఖాతమేనని వ్యాఖ్యానించారు. కేబీఆర్ పార్క్ దగ్గరకు వచ్చే వాకర్స్ అసోసియేషన్ ప్రజాప్రయోజన వాజ్యం వేయాలని కోరారు. రెండు మూడు రోజులు తర్వాత మరిన్ని వివరాలతో మీడియా ముందుకు వస్తానని రేవంత్ చెప్పారు.

జిల్లా వార్తలు


వరంగల్ నిట్ నుంచి డాక్టరేట్



హితవాణి

మధిర: మధిరకు చెందిన జక్కేపల్లి హితవాణికి వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) నుంచి డాక్టరేట్ లభించింది. రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పీ.వీ.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ఆమె జీన్ డెలివరీ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. నిట్‌లోనే ఎమ్మెస్సీ పూర్తిచేసిన హితవాణి డాక్టరేట్ అందుకోగా, ఆమె భర్త డాక్టర్ జక్కేపల్లి పవన్‌కుమార్ కూడా నిట్ నుంచే గతంలో డాక్టరేట్ స్వీకరించారు. ఈ సందర్భంగా హితవాణిని మధిర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు వేమవరపు వెంకటేశ్వరశర్మ తదితరులు అభినందించారు.

ఎస్సెస్సీ 'స్పాట్' ప్రారంభం



రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో క్యాంపు ఏర్పాటుచేయగా, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు రిపోర్ట్ చేశారు. రోజుకు ఒక్కో ఎగ్జామినర్ 40 జవాబుపత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా 'స్పాట్' విధుల పట్ల ఉపాధ్యాయులు ఆసక్తి చూపించడం లేదన్నారు. పలువురు వివిధ కారణాలను చూపుతూ విధులు రద్దు చేయించుకోగా, కొత్త వారికి కేటాయించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఆభరణాల అమ్మకం ఆరోపణలపై విచారణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో ఆభరణాలు పూజారి విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలతో గురువారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన విచారణ చేపట్టారు. దేవాలయం రికార్డులు, ఆభరణాలు పరిశీలించి అన్నీ ఉన్నట్లు తేలడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నేలకొండపల్లిలో భీమేశ్వరస్వామి ఆలయ భూముల వివాదంపై విచారణ చేపట్టారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ పి.నారాయణచార్యులు, అర్చకులు మధుసూదనాచార్యులు, శివయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీకి వడదెబ్బ!



గురువారం మధ్యాహ్నం వెలవెలబోతున్న కొత్తగూడెం బస్టాండ్

- ఎండలతో తగ్గుతున్న ప్రయాణికుల సంఖ్య
- మధ్యాహ్నం వేళ బస్సులు, బస్టాండ్లు ఖాళీ
- నాలుగు రోజులుగా పడిపోతున్న ఆదాయం



ఖమ్మం వెళ్లే బస్సులో అరకొరగా ప్రయాణికులు

చుంచుపల్లి: ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని భావిస్తున్న ఆర్టీసీపై భానుడు తన పంజా విసురుతున్నాడు. నష్టాల బారి నుంచి బయటకు వస్తోందని భావిస్తుండగా.. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ఆర్టీసీపై పడింది. మండుతున్న ఎండల దృష్ట్యా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేందుకు జనం వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా ఎండలు మండిపోతుండగా, ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 43 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుండగా ప్రయాణాలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళ ప్రజలెవరూ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కకపోవడంతో అటు బస్టాండ్లు, ఇటు బస్సులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏప్రిల్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకపోగా.. ఎక్కువ మంది ఉదయం లేదా రాత్రి వేళల్లోనే బస్సెక్కుతున్నారు. ఇంకొందరు చార్జీ ఎక్కువైనా సరే అని ఏసీ బస్సులను ఆశ్రయిస్తుండగా ఆ బస్సులకు డిమాండ్ పెరిగింది. గత నాలుగు రోజులుగా ఆర్టీసీలో ప్రయాణికులు సంఖ్య అమాంతం తగ్గడంతో ఆదాయం గణనీయంగా పడిపోతోంది.

డిపోకు రూ.2 లక్షలపైనే గండి

ఏప్రిల్‌లోనే నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు రావడం లేదు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల నుంచి హైదరాబాద్ రూట్‌కు నిత్యం ఎక్కువ సర్వీసులు నడుస్తాయి. ఆయా డిపోల నుంచి సాధారణ రోజుల్లో నిత్యం లక్షకు పైగా జనం ప్రయాణిస్తారు. కానీ ఎండలతో ఈ సంఖ్య పడిపోగా.. పగటి వేళ బస్సులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అటు ఆర్టీసీ ఉద్యోగులు సైతం మండే ఎండలను తట్టుకోలేకపోతున్నారు. నాలుగు రోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని వారు చెబుతున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు చేసేదేం లేక మధ్యాహ్నం సర్వీసులు తగ్గించి ఉదయం, రాత్రి వేళ పెంచడంపై దృష్టి సారించారు. కాగా, గడిచిన నాలుగు రోజులుగా భానుడి ప్రభావంతో ఒక్కో డిపో పరిధిలో సగటున రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో రోజువారీ ఆదాయం అంచనా రూ.1,09,81,000 కాగా, ఈనెల 11వ తేదీన రూ.91,81,842, 12న రూ.85,53,615 మాత్రమే నమోదైంది.

ఆదాయం తగ్గిపోతోంది..



ఇటీవల పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభావం ఆర్టీసీపై కూడా పడింది. ఎండల తీవ్రతతో నాలుగు రోజులుగా ఆర్టీసీలో ప్రయాణాలు తగ్గుతున్నాయి. ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలెవరూ రావడం లేదు. దీంతో ఆర్టీసీ రోజువారీ ఆదాయం గణనీయంగా పడిపోతోంది. ఉదయం, రాత్రివేళ ప్రయాణానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

– బి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్, కొత్తగూడెం

గడిచిన రెండు రోజుల్లో డిపో వారీగా ఆదాయ(రూ.ల్లో)

డిపో	రోజువారీ లక్ష్యం	11వ తేదీ	12వ తేదీ
ఖమ్మం	30,35,000	23,88,811	22,08,602
మధిర	11,53,000	10,58,177	9,31,116
సత్తుపల్లి	19,14,000	15,60,075	15,13,465
భద్రాచలం	20,87,000	17,94,880	17,28,103
కొత్తగూడెం	12,42,000	10,91,446	8,95,693
మణుగూరు	15,50,000	12,88,453	12,76,636

లక్ష్యాలు సాధించిన డీసీసీబీ మేనేజర్లకు సత్కారం

ఖమ్మంవ్యవసాయం: బంగారం రుణాల, డిపాజిట్ల సేకరణ లక్ష్యాలను సాధించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలోని మేనేజర్లను గురువారం సన్మానించారు. ఖమ్మంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లను బ్యాంక్ చైర్మన్ కూరాకుల నాగభూషణం సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాల లక్ష్యాలను అశ్వారావుపేట, దమ్మపేట, పేరూరు, చింతకాని బ్రాంచ్ మేనేజర్లు అనూష, సత్యనారాయణ, దామోదర్‌రావు, మంజూష, డిపాజిట్ల సేకరణలో ఖమ్మం గట్టయ్య సెంటర్, దమ్మపేట మేనేజర్లు సృజన, సత్యనారాయణ లక్ష్యాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ అట్లూరి వీరబాబు, జనరల్ మేనేజర్లు పద్మావతి, నర్మద తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న మేనేజర్లతో డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

కలెక్టర్ చొరవతో 60 ఏళ్ల కల సాకారం



రహదారి వెంట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీతో ప్రజాప్రతినిధులు, అధికారులు

- మధ్యగుంపునకు రహదారి ఏర్పాటు
- 'అనుదీప్ గుంపు'గా గ్రామస్తుల నామకరణం

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సరైన రహదారి సౌకర్యం లేని గ్రామాలు ఇప్పటికీ కనిపిస్తాయి. అలాగే ఒకటి కాదు రెండు కాదు.. 60 ఏళ్లుగా ఆ గ్రామస్తులు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. ఎందరు అధికారులు మారినా సమస్య పరిష్కారం కాకపోగా ప్రస్తుత కలెక్టర్ చొరవతో రహదారి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తమ గ్రామానికి 'అనుదీప్ గుంపు'గా నామకరణం చేసి కృతజ్ఞత చాటుకున్నారు. దుమ్ముగూడెం మండలంలోని సుబ్బారావుపేటలో మధ్యగుంపులో 200 మందికి పైగా ప్రజలు ఉండగా.. బయటకు రావడానికి రహదారి సౌకర్యం లేక పొలం గట్లపై నుంచి నడవాల్సి వచ్చేది. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి నెలకొనగా.. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు వెళ్లాలంటే ఇక్కట్లు ఎదుర్కొనేవారు. ఈక్రమంలో పొలం యజమాని, గ్రామస్తుల నడుమ పలుసార్లు వాగ్వాదం జరిగింది. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓ చంద్రమౌళి రంగంలోకి దిగి రైతు, ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడి గ్రామంలోకి వెళ్లడానికి పొలం నుండి ఎనిమిది అడుగుల వెడల్పుతో 200 మీటర్ల పొడవున స్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. ఆ స్థలంలో చెట్లు, రాళ్లు తొలగించి గురువారం రహదారి పనులు మొదలుపెట్టగా.. స్థానికులు అనుదీప్ గుంపుగా నామకరణం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. అలాగే, రహదారికి కోసం స్థలం ఇచ్చిన రైతును సన్మానించగా ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీఓ ముత్యాలరావు, సర్పంచ్ వర్షా చిన్నారావు, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలకు దూరం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని చీమలపాడులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనతో పాటు తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు అనారోగ్యం దృష్ట్యా ఈనెల 19న తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జన్మదిన సంబరాలకు బదులు ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సాయం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. చీమలపాడు ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు.

అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలంఅర్బన్: మారుమూల గిరిజన గ్రామాల్లో ఆవాసాలకు బీటీ రోడ్ల నిర్మాణం, అటవీ అనుమతుల కోసం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేపట్టి ప్రతిపాదనలు సమర్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా బీటీ రోడ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, ములకలపల్లి, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో రహదారులు అవసరమైన ఆవాసాలను గుర్తించి అటవీ అనుమతులపై దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఉమ్మడి సర్వే చేసి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ఈసమీక్షలో ఆర్‌అండ్‌బీ ఈఈ హరిలాల్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్‌తో పాటు అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్